క్లుప్తంగా

చిన్నారికి చేయూత



గద్వాల అర్బన్: జన్యుపరమైన సమస్యతో బరువు పెరగకుండా బాధపడుతున్న ఓ చిన్నారికి సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం చేయూత అందించింది. జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన చిన్నారి జన్యుపరమైన సమస్యతో వయస్సుకు అనుగుణంగా బరువు పెరగడంలేదు. ఆపరేషన్‌తో వ్యాధిని తగ్గించ వచ్చని వైద్యులు చెప్పడంతో సోమవారం సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం సభ్యులు చిన్నారి తల్లిదండ్రులు లక్ష్మి, రమేష్‌కు రూ.40వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వైద్యుడు శ్యాం, సోషల్ రెస్పాన్సిబులిటీ బృందం సభ్యులు శివ, విష్ణు, సంజీవ్, అశోక్ ఉన్నారు.

అయిజ: పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ ప్రవీణ్‌కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి పిల్లల పోషణ నిమిత్తం సోమవారం మున్సిపల్ వైస్‌చైర్మన్ మాల నర్సింహులు రూ.10వేలు, ఎంపీపీ నాగేశ్వర్ రెడ్డి రూ.10వేలు, మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్తులో పిల్లల చదువుకు అండగా ఉంటామని తెలిపారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

అలంపూర్ రూరల్: మండలంలోని బుక్కాపూర్‌లో ఎరువులు, విత్తనాల దుకాణాలను సోమవారం ఏఓ అనిత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులతోపాటు విత్తనాలు, ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని తెలిపారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా



అయిజ: పట్టణంలోని పెద్దవాగుపై మిషన్ భగీరథ పైపులైన్‌ను పునరుద్ధరించే వరకు ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేస్తామని మున్సిపల్ వైస్‌చైర్మన్ మాల నర్సింహులు తెలిపారు. పట్టణంలోని 9వ వార్డులో సోమవారం ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైపులైన్ మరమ్మతులకు మరో నాలుగు రోజుల సమయం పడుతుందని, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

గద్వాల అర్బన్: మణిపూర్‌లో ఘటనపై పాలమూరు అధ్యాయన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్ ఇక్బాల్ పాషా సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజా, కుల సంఘాల నాయకులు, మేధావులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయంతం చేయాలని కోరారు.

విద్యుత్ స్తంభాలను తొలగించండి



అలంపూర్: మండలంలోని లింగనవాయి గ్రామంలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలను తొలగించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం సీపీఎం జిల్లా నాయకుడు ఈదన్నతో కలిసి ఏడీఈ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగనవాయి న్యూప్లాట్స్ కాలనీలో క్యాతూర్–కోనేరు రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభంతో ప్రమాదం పొంచి ఉన్నట్లు పేర్కొన్నారు. స్తంభం తొలగింపు ఇతర సమస్యలపై ఐదు నెలల కిందట విద్యుత్ ఏఈకి వినతి పత్రం అందజేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రహీం, రజాక్, గులాం, మధు, సైమన్, మహ్మద్ పాల్గొన్నారు.

ప్రతినెలా పరీక్షలు చేయించుకోవాలి

మల్దకల్: గర్భిణులు ప్రతినెలా వైద్యపరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ స్వరూపరాణి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ సత్యమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి క్షేత్రంలోని శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకొని అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ రెడీ

- ప్రారంభానికి సిద్ధమైన నూతన భవనం
- రూ.1.50 కోట్లతో నిర్మాణం
- చిరు వ్యాపారులకు 40 గదులు ఏర్పాటు
- అదనపు నిర్మాణాలకు రూ.48లక్షలు మంజూరు



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన సముదాయం

అయిజ: ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన సముదాయం ప్రారంభానికి సిద్ధమవుతోంది. పట్టణంలోని చిరు వ్యాపారుల కోసం రూ.1.50 కోట్లతో 40 షాపులతోకూడిన సముదాయాన్ని ప్రభుత్వం నిర్మించింది. అర్హులైన చిరు వ్యాపారులకు దుకాణాలను కేటాయించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పూలు, చిరుధాన్యాలు ఇతర వీధి విక్రయదారులు సుమారు 300మంది రోడ్డు పక్కన వ్యాపారం చేసుకుంటున్నారు. రోడ్డు పక్కన వ్యాపారంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. కూరగాయలు ఇతర వస్తువులను కొనేందుకు వచ్చే వారు మోటార్‌సైకిళ్లు, ఆటోలను రోడ్డు పక్కన పార్కింగ్ చేస్తుండడంతో పాతబస్టాండ్ నుంచి కొత్తబస్టాండ్ వరకు ఉన్న ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌జామ్ అవుతోంది. దీంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని అధిగమించేందుకుగానూ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వాగు పక్కనున్న ప్రభుత్వ స్థలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించారు.

కొనసాగుతున్న అదనపు నిర్మాణాలు

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయంలో అదనపు నిర్మాణాలకుగానూ ప్రభుత్వం రూ.48లక్షలు మంజూరు చేసింది. ప్రహరీ నిర్మాణానికి రూ.15లక్షలు, స్ట్రీట్ వైడింగ్‌కు రూ.10లక్షలు, కల్వర్టుల నిర్మాణానికి రూ.5లక్షలు, రీటైనింగ్ హాల్‌కు రూ.15లక్షలు, గ్రీనరికి రూ.3లక్షలు కేటాయించారు. వీటి నిర్మాణం కొనసాగుతోంది. ఇసుక కొరత వల్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. వీలైనంత త్వరగా పనులను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

రోడ్డు పక్కన విక్రయిస్తున్నాం..



కొన్ని సంవత్సరాలుగా పాతబస్టాండ్ వద్ద పండ్ల వ్యాపారం చేస్తున్నాను. రోడ్డు పక్కన వ్యాపారం చేయడం ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం పూర్తయితే దాంట్లో వ్యాపారం చేసుకోవాలని అనుకుంటున్నాను. పనులను త్వరగా పూర్తిచేసి ప్రారంభిస్తే బాగుంటుంది.

– వీరేష్, పండ్ల వ్యాపారి, అయిజ

దుమ్మూధూళితో అవస్థలు పడుతున్నాం..



ప్రధాన రహదారి పక్కన చిన్న బండిపై పూల వ్యాపారం చేయడం కష్టంగా ఉంది. దుమ్మూధూళి పూలపై పడుతుంది. దీంతో పూలు త్వరగా వాడిపోతున్నాయి. రోడ్డు పక్కన కొనుగోలుదారులు వాహనాలను నిలపడం ప్రమాదకరంగా మారింది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనంలో కొన్ని షాపులను పూల వ్యాపారులకు కేటాయిస్తే సౌకర్యవంతంగా ఉంటుంది.

– అలీబాషా, పూలవ్యాపారి, అయిజ

డిపాజిట్ లేకుండా ఇస్తే బాగుంటుంది..



ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం ప్రారంభించిన తర్వాత చిరు వ్యాపారులకు గదులు కేటాయిస్తామంటున్నారు. టెండర్ లేదా వేలం నిర్వహించి గదులను కేటాయిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని అంటున్నారు. పేదరికంలో ఉన్న చిరు వ్యాపారులతో డిపాజిట్ చేయించుకోకుండా నెలవారీ అద్దెను వసూలు చేస్తే బాగుంటుంది.

– మహ్మద్ గౌస్, కూరగాయల వ్యాపారి, అయిజ

త్వరలోనే పూర్తి చేస్తాం



పట్టణంలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ప్రహరీ నిర్మాణానికి రూ.15లక్షలు, స్ట్రీట్ వైడింగ్‌కు రూ.10లక్షలు, కల్వర్టులకు రూ.5లక్షలు, రీటైనింగ్ హాల్ నిర్మాణానికి రూ.15లక్షలు అదనంగా మంజూరయ్యాయి. గ్రీనరి పనులకు రూ.3లక్షలు కేటాయించారు. వీటిలో కొన్ని పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. మరికొన్ని ప్రారంభించాల్సి ఉంది. త్వరలోనే పనులను పూర్తిచేసి అధికారికంగా ప్రారంభిస్తాం.

– నర్సయ్య, మున్సిపల్ కమిషనర్, అయిజ

మహాధర్నాకు తరలిన నాయకులు

శాంతినగర్ : బీజేపీ ఆధ్వర్యంలో డబుల్ బెడ్రూం ఇళ్లపై సోమవారం జిల్లా కేంద్రంలో చేపట్టిన మహాధర్నాకు వడ్డేపల్లి మండల నాయకులు తరలివెళ్లారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పిలుపుమేరకు ధర్నాలో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మధుసూదన్‌గౌడ్, వెంకటేశ్వర్లు, మోహన్, అయ్యరాజు, శేఖర్ ఆచారి పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

అయిజ: మండలంలోని పులికల్‌కు చెందిన 11మందిని సోమవారం ఎక్సైజ్ పోలీసులు తహసీల్దార్ లక్ష్మి ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ గోపాల్ మాట్లాడుతూ పులికల్‌కు చెందిన నలుగురు అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడ్డారని, మరో ఏడుగురిపై అనుమానంతో బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై గోవర్ధన్, కానిస్టేబుల్స్ మహేష్, వేణు, షబ్బీర్ పాల్గొన్నారు.

క్షయపై అవగాహన



అలంపూర్ రూరల్: మండలంలోని లింగనవాయి, గొందిమల్ల సోమవారం క్యాతూర్ పీహెచ్‌సీ సిబ్బంది క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎవరికైనా క్షయ లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తర్ణాధికారి లక్ష్మీకాంత్, ఎంఎల్ పీహెచ్ శివకుమార్, బాలసిద్ధేశ్వరి, బాలీశ్వరయ్యశెట్టి, శ్యామలదేవి, సువర్ణకుమారి, సురేఖ పాల్గొన్నారు.

వెండి కిరీటం వితరణ



మానవపాడు: మండల కేంద్రానికి చెందిన గంగు రామేశ్వర్‌రెడ్డి కుమారులు రాజేశ్వర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి సోమవారం స్థానిక శివాలయానికి మూడు కేజీల వెండి కిరీటం వితరణ చేశారు. రూ.2లక్షల 40వేల విలువైన కిరీటాన్ని స్వామివారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, వెంకట్రాముడు, రఘురెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

విధిగా మొక్కలు నాటాలి

మానవపాడు: హరితహారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని మొక్కలు నాటాలని ఎంపీడీఓ రమణారావు కోరారు. మండలంలోని కలుకుంట్ల, చంద్రశేఖర్‌నగర్ గ్రామాల్లో సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి ఆవరణ, వ్యవసాయ పొలాల్లో మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఆత్మలింగారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

శాంతినగర్ ఎస్‌ఐగా నరేష్

శాంతినగర్: స్థానిక పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చిన ఎస్‌ఐ నరేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా జిల్లా కేంద్రంలో ఎస్పీ సృజనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



గట్టులో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు



ఉండవెల్లిలో..

మానవపాడు: వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించి పేస్కేల్ అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగులుగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల జేఏసీ కన్వీనర్ గోవింద్, పరుశరాముడు, కేశవులు, నర్సింహ, రాజేశ్వరి, రాంగోపాల్, హనుమంతు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వీఆర్‌ఏలను రెగ్యులరైజ్ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

గట్టు: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్డీఓ



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్డీఓ చంద్రకళ

గద్వాల రూరల్: గద్వాల ఆర్డీవోగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన చంద్రకళ సోమవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అదేవిధంగా రాష్ట్ర శిక్షణ ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.

డ్రైవింగ్ లైసెన్స్‌ల పంపిణీ..

క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పలువురికి డ్రైవింగ్ లైసెన్స్‌లను పంపిణీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ కోసం యువత ఇబ్బందులు పడొద్దని ఉచితంగా ఇప్పిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ కేశవ్, ఎంపీపీ ప్రతాప్‌గౌడ్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అలంపూర్ రూరల్: సీజనల్ వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ చంద్రకళ కోరారు. మండలంలోని భీమవరం, ఊట్కూర్ గ్రామాల్లో సోమవారం పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. మురుగు కాల్వల్లో ఆయిల్‌బాల్స్ వేయించారు. ఇండ్ల మధ్య నీరు నిలువకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

గద్వాల/అర్బన్/క్రైం : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభించారు. అంతకుముందు కేక్ కట్ చేశారు. ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బండారి భాస్కర్ ఆధ్వర్యంలో స్థానిక అంధుల ఆశ్రమ పాఠశాలలో కేక్ కట్ చేసిన అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, ఆస్పత్రి సూపరిండెండెంట్ కిశోర్‌కుమార్, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అలంపూర్ : బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాల అభ్యున్నతి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రమణ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం క్యాంపు కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రెడ్డి, నర్సన్నగౌడు, అనంతరెడ్డి, శంకర్‌గౌడ్, మహేష్‌నాయుడు, సుంకన్న, రాజశేఖర్ కృష్ణగౌడ్, వెంకటేశ్వర్లు, ధనుంజయ, నర్సింహ, శివకేశవరెడ్డి, బాలు, గోవిందు, వెంకటేష్ పాల్గొన్నారు.

అయిజ: మండల కేంద్రంలో మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్‌వీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పదోతరగతి విద్యార్థినులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. పీహెచ్‌సీలో రోగులకు పండ్లు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య, అధ్యక్షుడు మల్లికార్జున్ పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న జెడ్పీ మాజీ చైర్మన్ భాస్కర్

శాంతినగర్ : వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలో మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జెడ్పీటీసీ కాశపోగు రాజు, ఎంపీపీ రజిత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశ్వర్ రెడ్డి, శేఖర్ కేక్ కట్ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య, ప్రేమలత విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. వెంకట్రామనగర్‌లో సర్పంచ్ ఆంజనేయులు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.



అలంపూర్ చౌరస్తాలో మొక్క నాటుతున్న నాయకులు

డ్రెయినేజీ పనులు ప్రారంభం

అలంపూర్ రూరల్: మండలంలోని భీమవరంలో డ్రెయినేజీ పనులు ప్రారంభమయ్యాయి. సాక్షిలో సోమవారం ప్రచురితమైన 'నత్తనడకన డ్రెయినేజీ పనులు' కథనంపై ఎంపీడీఓ చంద్రకళ స్పందించారు. గ్రామంలో చేపట్టిన డ్రెయినేజీ పనులను పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శి నాగేంద్రమ్మ ఉన్నారు.

సాక్షి ఎఫెక్ట్..



డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రకళ

మతతత్వ పార్టీలను బొందపెడదాం



ర్యాలీ నిర్వహిస్తున్న బీఎస్పీ నాయకులు

అలంపూర్: దేశంలో మతతత్వ పార్టీలను బొందపెడదామని బీఎస్పీ నియోజకవర్గ మహిళా కన్వీనర్ నాగజ్యోతి, కరీంనగర్ జిల్లా నాయకురాలు శారదమ్మ అన్నారు. మణిపూర్ ఘటనను నిరసిస్తూ సోమవారం అలంపూర్ చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకుముందు బీఎస్పీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయినా మహిళలపై దాడులు జరగడం సిగ్గు చేటన్నారు. మణిపూర్ ఘటనపై ప్రధాని మోదీ స్పందించకపోవడం బాధాకరమన్నారు. బీఎస్పీ జిల్లా ఇంచార్జ్ కృష్ణ, నియోజకవర్గ అధ్యక్షుడు తిరుపాలు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలంటే పాలకులకు పట్టింపు లేకుండాపోయిందన్నారు. మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేశ్వరి, వెంకటేష్, యువరాజు, లక్ష్మన్న, జలంధర్, చిన్నా, రాజు, ప్రకాశం పాల్గొన్నారు.

ధరూరు: మణిపూర్‌లో మహిళలపై దాడులను ఖండిస్తూ మండల కేంద్రంలో క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేశారు. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నరేష్, ప్రభాకర్, కృపరాజ్, అబ్రహం, రేబేను, రాము, సురేష్ పాల్గొన్నారు.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

అలంపూర్: విద్యార్థులు మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని ఇంటర్ జిల్లా నోడల్ అధికారి హృదయరాజు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కవి కోకిల గుర్రం జాషువ 52వ వర్ధంతిని సమ సమాజ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై గుర్రం జాషువ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పది, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



బహుమతులను అందజేస్తున్న హృదయరాజు

కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ దేవేందర్‌రెడ్డి, నందు, నాగరాజు, ఆశన్న, రాజు వెంకటస్వామి, జాన్సన్, అయ్యప్ప తదితరులు ఉన్నారు.

ఇంటిపన్ను వసూలు

అలంపూర్ రూరల్: పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం మున్సిపల్ సిబ్బంది ఇంటిపన్ను, నల్లా బిల్లులను వసూలు చేశారు. పెండింగ్ బకాయిల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. రూ.12,422 బిల్లులను వసూలు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకట్రాములు, మదిల్టేటి, వినోద్, మౌలాలి, తిరుపాలు, ఖయ్యూ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు

గద్వాల క్రైం: జిల్లా కేంద్రంలోని మేలచెరువు ప్రధాన రహదారిపై సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరిని గుర్తించి డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఉండవెల్లి: మండలంలోని తక్కశీల, శేరుపల్లి, ప్రాగటూరు గ్రామాల్లో సోమవారం తహసీల్దార్ వీరభద్రప్ప పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తక్కశీల పాఠశాలలో మనఊరు–మనబడి పనులు కొనసాగుతున్నందున మరో భవనంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. శేరుపల్లెలో కొత్తగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు నిమిత్తం పాఠశాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ వెంట సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీరెడ్డి ఉన్నారు.

భారీ వర్షం

ధరూరు: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. వారం రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలతో జనం ఇబ్బందులకు గురవుతున్నారు. ముసురుతో పంటలకు నష్టం చేకూరుతోంది. ఇప్పటికే పత్తిపంట ఎర్రబారి రైతులు తీవ్ర నష్టాలను చవిచూడగా.. ఈ ముసురుతో మరిన్ని కష్టాలు ఎదురయ్యే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. చల్లని ఈదురు గాలులతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు.

కేటీదొడ్డి: మండల కేంద్రంలో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. దాదాపు గంట పాటు వర్షం కురువడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఇటీవల మోస్తారు వర్షాలు కురుస్తుండడంతో రైతులు పంటల సాగులో నిమగ్నమయ్యారు.

కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

అలంపూర్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో తమ డిమాండ్ల సాధన కోసం కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 18వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.19వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కవిత, గిడ్డమ్మ, లాలన్న, ఎల్లన్న, దాసు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



శాంతినగర్: అలంపూర్ మండలం జి.సింగవరం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు, యువకులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. శాంతినగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరగా.. కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో అలంపూర్ మండల అధ్యక్షుడు అడ్డాకుల రాము, శ్రీను, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, మధు, రవికుమార్, గోపాల్, సాయిబాబా, రాముడు, మహేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై చర్చ..

మానవపాడు: మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలపై కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ చర్చించారు. అలంపూర్ నియోజకవర్గంలో రాజకీయాలు, ప్రజా సమస్యలు ఇతర అంశాలపై చర్చించినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్షాధారంగా పత్తి సాగు వద్దు

అలంపూర్ రూరల్: వర్షాధారంగా పత్తిపంటను సాగు చేయొద్దని ఏడీఏ సక్రియానాయక్ రైతులకు సూచించారు. కాశీపూర్, శింగవరం, ర్యాలంపాడ్, సూల్తాన్‌పూర్ గ్రామాల్లో సోమవారం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలస్యంగా పత్తి సాగు చేస్తే గులాబీరంగు పురుగు బెడద ఎక్కువగా ఉంటుందన్నారు. వర్షాధారంగా కందులు, ఆముదం, సోయచిక్కుడు, పొగాకు లాంటి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. నీటి వసతి ఉన్న రైతులు మొక్కజొన్న, మిరప, ఉల్లి తదితర పంటలను సాగు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ శిరీష, వీఆర్‌ఏ జూపాలి పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై ఈనెల 17న ఎద్దుల బండిని కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలైన విషయం విధితమే. ప్రమాదానికి గురైన వెంకట్రాముడు భార్య మిట్టగిరి దుర్గమ్మ ఫిర్యాదు మేరకు సోమవారం కారు డ్రైవర్ శేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

గద్వాల క్రైం: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రం సమీపంలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. కృష్ణారెడ్డి బంగ్లాకు చెందిన రైతు సత్యారెడ్డి తన గేదెలను మేపేందుకుగానూ పట్టణ శివారులోని వ్యవసాయ పొలానికి తీసుకెళ్లారు. బోరు మోటార్ విద్యుత్ వైర్లను ప్రమాదవశాత్తు గేదే తాకడంతో షాక్‌కు గురై మృతి చెందింది. గేదె విలువ రూ.60వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. విషయం తెలుసుకున్న వెటర్నరీ డాక్టర్ శంకరయ్య ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు.

తప్పిన ప్రమాదం

అయిజ: మండలంలోని చిన్నతాండ్రపాడులో సోమవారం పెను ప్రమాదం తప్పింది. వేణుసోంపురం గ్రామానికి చెందిన డ్రైవర్ శీను ట్రాక్టర్‌తో చిన్నతాండ్రపాడుకు వెళ్తుండగా, మార్గమధ్యంలో అదుపుతప్పి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.